క్లుప్తంగా

మృతురాలికి మంత్రి అంబటి రాంబాబు నివాళి



ముప్పాళ్ళ : మండల కేంద్రమైన ముప్పాళ్ళ గ్రామ పంచాయతీ పరిధిలోని శివారు ఎస్సీ కాలనీకి చెందిన చిరుగూరి కృపావతి మృతదేహాన్ని జలవనరులశాఖ మంత్రి అంబటి రాంబాబు బుధవారం సందర్శించి పూలమాలలు వేసి నివాళులర్పించారు. చిరుగూరి కృపావతి మంగళవారం జరిగిన ట్రాక్టర్ ప్రమాదంలో మృతి చెందిన సంగతి తెలిసిందే. స్థానిక నాయకుల ద్వారా సమాచారం తెలుసుకున్న మంత్రి అంబటి రాంబాబు గ్రామానికి చేరి సంఘటన జరిగిన తీరును కుటుంబసభ్యులను అడిగి తెలుసుకున్నారు. మృతురాలి పిల్లలు, భర్తతో మాట్లాడి వారికి ఆత్మస్థైర్యం కలిగించారు. మీ భవిష్యత్తుకు పార్టీ, ప్రభుత్వ పరంగా అండగా ఉంటుందని భరోసా కల్పించారు. వైస్ ఎంపీపీ చిరుగూరి రాయన్న, వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ నక్కా శ్రీనివాసరావు, వైఎస్సార్‌సీపీ నాయకులు ఎమ్‌జెఎమ్‌రామలింగారెడ్డి, ఇందూరి నరసింహారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

నవరత్నాల రూపంలో బీసీల అభివృద్ధి

ముదిరాజ్ కార్పొరేషన్ చైర్మన్ నారాయణ ముదిరాజ్



నకరికల్లు: నవరత్నాల రూపంలో బీసి సామాజిక వర్గాల్లో ఆర్థిక పురోగతి సాధ్యపడిందని ముదిరాజ్ కార్పొరేషన్ చైర్మన్ నారాయణ ముదిరాజ్ అన్నారు. మండలంలోని చాగల్లు, రూపెనగుంట్ల గ్రామాల్లో ముదిరాజుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సీట్ల కేటాయింపులో మరేపార్టీ ఇవ్వలేనంతగా అసెంబ్లీ స్థానాలు కేటాయించి బీసిల పట్ల చిత్తశుద్దిని చాటుకుందన్నారు. రానున్న ఎన్నికల్లో ఫ్యాన్ గుర్తుపై బీసిలంతా ఓటువేసి ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్‌రెడ్డిని మరోసారి ముఖ్యమంత్రిని చేసుకోవాలన్నారు. సత్తెనపల్లి అసెంబ్లీ అభ్యర్థి, మాజీ మంత్రి అంబటి రాంబాబు, నరసరావుపేట పార్లమెంటు అభ్యర్థి పి.అనిల్‌కుమార్ యాదవ్ చిత్తశుద్ధి కలిగిన నాయకులని కొనియాడారు. కార్యక్రమంలో ఆయా గ్రామాల ముదిరాజులు పాల్గొన్నారు.

ఇంటింటి ప్రచారంలో గుడిపూడి పూర్వ వలంటీర్లు



సత్తెనపల్లి : మండలంలోని గుడిపూడి గ్రామంలో పూర్వ గ్రామ వలంటీర్లు విస్తృతంగా ఇంటింటి ఎన్నికల ప్రచారం చేస్తున్నారు. రెండు రోజుల నుంచి ప్రచారంలో వేగం పెంచారు. బుధవారం ప్రతి ఇంటికి వెళ్లి వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో జరిగిన మేలును ప్రజలకు వివరిస్తూ గత ప్రభుత్వ హయంలో జన్మభూమి కమిటీల పరిపాలన గుర్తు చేస్తూ రెండింటిని బేరీజు వేసుకుని వైఎస్సార్ సీపీ ప్రభుత్వాన్ని ఆశీర్వదించాలని కోరారు. మే 13న జరిగే సార్వత్రిక ఎన్నికల్లో ఫ్యాన్ గుర్తుపై రెండు ఓట్లు వేసి సత్తెనపల్లి ఎమ్మెల్యే అభ్యర్థిగా పోటీ చేస్తున్న జలవనరుల శాఖ మంత్రి అంబటి రాంబాబు, నరసరావుపేట పార్లమెంట్ అభ్యర్థిగా పోటీ చేస్తున్న డాక్టర్ పి.అనిల్‌కుమార్ యాదవ్‌ని గెలిపించాలని అభ్యర్థిస్తున్నారు. పేదల పక్షాన అండగా నిలిచిన ముఖ్యమంత్రి జగన్‌మోహన్ రెడ్డిని గెలిపించి ఇంటింటికి అందిన సంక్షేమాన్ని కొనసాగించేలా ఆశీర్వదించాలని కోరారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ గుంటూరు నతానియేలు, పూర్వ గ్రామ వలంటీర్లు, తదితరులు ఉన్నారు.

మున్సిపల్ అధికారుల కృషి అభినందనీయం



సత్తెనపల్లి : పుర ప్రజల మంచినీళ్ల కోసం నాగార్జునసాగర్ కుడికాలువకు నీరు విడుదల చేసిన వెంటనే స్పందించి ఇంజన్లు, మోటార్లు పెట్టి సమ్మర్ స్టోరేజ్ ట్యాంక్‌ను నింపేందుకు మున్సిపల్ అధికారులు చేస్తున్న కృషి అభినందనీయమని సీపీఎం మాజీ రాష్ట్ర కమిటీ సభ్యుడు గద్దె చలమయ్య అన్నారు. బుధవారం ఆ పార్టీ బృందం సమ్మర్ స్టోరేజ్ ట్యాంకును సందర్శించింది. అక్కడ ఉన్న సిబ్బందితో సాగర్ జలాలతో సమ్మర్ స్టోరేజ్ ట్యాంక్‌ను నింపు తున్న తీరును, వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో సీపీఎం పట్టణ కార్యదర్శి ధరణికోట విమల, సీపీఎం నాయకులు కట్టా శివ దుర్గా రావు, అవ్వారు ప్రసాదరావు, పంతాంగి ప్రభాకర్, షేక్ మస్తాన్‌వలి, జడ రాజ్ కుమార్ లు ఉన్నారు.

రమణీయం...రాములోరి కల్యాణం

- వాడవాడలా ఘనంగా శ్రీరామ నవమి వేడుకలు
- ఆలయాల్లో అన్నసంతర్పణ కార్యక్రమాలు
- కల్యాణ వేడుకల్లో పాల్గొన్న మంత్రి అంబటి



నందిగామలో ప్రత్యేక అలంకరణలో శ్రీ సీతారాముల విగ్రహం



మహారాష్ట్ర వీధిలో ప్రత్యేక అలంకరణలో శ్రీ సీతారాముల విగ్రహం



విశేష అలంకరణలో నకరికల్లులోని పాతూరులో రామాలయం వద్ద శ్రీ సీతారామస్వామి



శ్రీ సీతారాముల కల్యాణవేడుకల్లో మంత్రి అంబటి రాంబాబు, పక్కన మున్సిపల్ చైర్‌పర్సన్ దంపతులు లక్ష్మీతులసీ, సాంబశివరావు



కోదండ రామాలయంలో సీతాసమేత కోదండరామస్వామి వారి కళ్యాణోత్సవంలో పాల్గొన్న ఎమ్మెల్యే నంబూరు శంకరరావు

సత్తెనపల్లి : మంగళ వాయిద్యాల మధ్య, ముల్లోకాలు మురిసేలా మూడుముళ్ల బంధంతో శ్రీరాముడు, సీతమ్మ తల్లి ఒకటైన మధుర క్షణాలు భక్తులను మంత్రముగ్ధుల్ని చేశాయి. సీతారాముల వారు ఒక్కటైన వేడుక అందరి మదిని ఆనందంలో ముంచెత్తింది.ఆదిదంపతులపై తలంబ్రాలు చల్లి పునీతులయ్యారు. సత్తెనపల్లి పట్టణంతో పాటు సత్తెనపల్లి రూరల్ మండల పరిధిలో బుధవారం శ్రీరామనవమి వేడుకలను వైభవంగా నిర్వహించారు. పట్టణంలోని కట్టమూరు వారి వీధిలోని రామాలయంలో ఆర్యవైశ్య చలివేంద్ర సంఘం ఆధ్వర్యంలో శ్రీ సీతారాముల వారి కళ్యాణ మహోత్సవాన్ని అత్యంత వైభవంగా నిర్వహించారు. కళ్యాణ వేడుకలు, పూజా కార్యక్రమాల్లో జలవనరుల శాఖ మంత్రి అంబటి రాంబాబు పాల్గొని స్వామి వారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి అంబటి రాంబాబు మాట్లాడుతూ శ్రీ కోదండరాముని కరుణా కటాక్షాలతో రాష్ట్రం సుభిక్షంగా ఉండాలని ఆకాంక్షించారు. శ్రీ సీతారాముల వారు ప్రజలందరినీ చల్లగా చూడాలని, ఈ ఏడాది మంచి వర్షాలు కురిసి రైతుల ఇంట సిరుల పంట పండేలా చూడాలని మొక్కుకున్నారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్ పర్సన్ దంపతులు చల్లంచర్ల లక్ష్మీ తులసి సాంబశివరావు, ఆర్యవైశ్య చలివేంద్ర సంఘం అధ్యక్షుడు శింగరి మధుసూదనరావు, వాణిజ్య విభాగం జిల్లా అధ్యక్షుడు అచ్యుత శివ ప్రసాద్, భక్తులు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు.

■ వడ్డవల్లి శ్రీ రామాలయం శ్రీ వెంకటేశ్వర స్వామి దేవాలయంలో శ్రీరామ నవమి వేడుకలు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఈ సందర్భంగా సీతారాముల కళ్యాణం వైభవంగా చేపట్టారు. భక్తులు పెద్ద సంఖ్యలో హాజరై కళ్యాణ ఘట్టాన్ని వీక్షించి స్వామి వారి కృపకు పాత్రులు అయ్యారు.

■ మహారాష్ట్ర వీధిలో ఉన్న శ్రీ భక్తాంజనేయ స్వామి దేవస్థానంలో శ్రీరామనవమి వేడుకలు వైభవంగా నిర్వహించారు. శ్రీ సీతారాముల కళ్యాణం మేళతాళాలు, భాజా భజంత్రీల మధ్య భక్తి శ్రద్ధలతో నిర్వహించారు. భక్తులు, మహిళలు పాల్గొని శ్రీ సీతారాముల కళ్యాణం తిలకించి తీర్థప్రసాదాలను స్వీకరించారు. భక్తులకు ఎలాంటి ఆటంకం కలగకుండా చత్రపతి శివాజీ యూత్ సభ్యులు, భక్తాంజనేయ స్వామి దేవస్థానం సభ్యులు ఏర్పాట్లను పర్యవేక్షించారు.

■ రఘురామ్‌నగర్‌లోని రామాలయంలో శ్రీ సీతారాముల కళ్యాణం వైభవంగా నిర్వహించారు. కళ్యాణ వేడుకలకు భక్తులు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు. శ్రీ సీతారాముల విగ్రహాలను ప్రత్యేకంగా అలంకరించి కళ్యాణం నిర్వహించారు. ఈ సందర్భంగా భక్తులకు అన్నసంతర్పణ నిర్వహించారు. భక్తులకు ఎలాంటి ఆటంకం కలగకుండా ఆలయ కమిటీ సభ్యులు ఏర్పాట్లను పర్యవేక్షించారు.

■ నాగార్జున నగర్‌లోని ప్రసన్నాంజనేయస్వామి దేవాలయంలో, గుంటూరు రోడ్‌లోని వాసవినగర్‌లోని పంచముఖ ఆంజనేయ స్వామి దేవాలయంలో, అబ్బూరు రోడ్‌లోని కోదండరామ దేవాలయంలో, నారాయణసేన నగర సంకీర్తన బృందం ఆధ్వర్యంలో కోటమ్మ సత్రంలో శ్రీసీతారాముల కల్యాణ మహోత్సవం కన్నుల పండువగా జరిగింది. కోటమ్మ సత్రంలో 42 మంది దంపతులు పీటలపై కూర్చున్నారు.

■ ఆర్యవైశ్య యువజన సంఘం ఆధ్వర్యంలో శ్రీరామనవమి పర్వదినాన్ని పురస్క రించుకొని గాంధీ చౌక్ సెంటర్‌లో పట్టణానికి వచ్చిన ప్రజలకు పానకం పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఆర్యవైశ్య యువజన సంఘం అధ్యక్షుడు చిల్లంచర్ల కళ్యాణ్ తో పాటు సభ్యులు, ఆర్యవైశ్య సంఘం నాయకులు పాల్గొన్నారు.

■ గడియార స్తంభం సెంటర్‌లోని మహాత్మా గాంధీ కాంప్లెక్స్ ఎదుట ఆర్యవైశ్య యువజన సంఘం గౌరవ అధ్యక్షుడు కొత్త రామకృష్ణ ఆధ్వర్యంలో శ్రీరామ నవమి వేడుకలు ఘనంగా నిర్వహించారు. సంప్రదాయ పద్ధతుల్లో పూజలు నిర్వహించి భక్తులకు వడపప్పు, పానకం పంపిణీ చేశారు. ఆర్యవైశ్య సంఘ పట్టణ అధ్యక్షుడు మద్ది వెంకటేశ్వరరావు, ఏరియా వైద్యశాల సూపరింటెండెంట్ డాక్టర్ బి.లక్ష్మణరావు పూజల్లో పాల్గొన్నారు. కొత్త రామకృష్ణ మాట్లాడుతూ ప్రతి సంవత్సరం శ్రీరామ నవమి వేడుకలను ఘనంగా నిర్వహిస్తున్నామని, అందులో భాగంగా ఈ ఏడాది శ్రీరామనవమి సందర్భంగా దాతల సహకారంతో ప్రతి రోజూ బాటసారులకు పంపిణీ చేసేందుకు మజ్జిగ చలివేంద్రాన్ని ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఆర్యవైశ్య సంఘ నాయకులు దేవరపల్లి కాశీ విశ్వనాథం, భవిరిశెట్టి సుబ్రహ్మణ్యం, దేవరపల్లి రాఘవ, తేజ, భవిరిశెట్టి హరికృష్ణ, రెడ్డి సురేష్, నోముల రమణ, కొత్తూరు హరి మణికంఠ, తదితరులు ఉన్నారు.

■ సత్తెనపల్లిరూరల్ మండలంలోని కొమెరపూడి, కంటెపూడి, కట్టావారిపాలెం, నందిగామ, గుడిపూడి, పెద్దమక్కెన, కట్టమూరు, అబ్బూరు, బట్లూరు, పణిదం, రెంటపాళ్ల, పాకాలపాడు, కంకణాలపల్లి, ధూళిపాళ్ల, భృగుబండ, కందులవారిపాలెం గ్రామాల్లో బుధవారం శ్రీరామనవమి వేడుకలు వైభవంగా నిర్వ హించారు. శ్రీ సీతారాముల కళ్యాణం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. వేడుకల్లో ప్రజలు పాల్గొని స్వామివారి కృపకు పాత్రులయ్యారు. పలు ఆలయాల వద్ద అన్నసంతర్పణ నిర్వహించారు. భక్తులకు ఎలాంటి ఆటంకం కలగకుండా ఆలయ కమిటీ సభ్యులు ఏర్పాట్లను పర్యవేక్షించారు.

వైభవంగా సీతారాముల కళ్యాణం

రాజుపాలెం : శ్రీరామ నవమి పండుగ సందర్భంగా సీతారాముల స్వామి వారి కళ్యాణాన్ని వైభవంగా నిర్వహించారు. బుధవారం మండలంలోని రామాలయాల్లో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని స్వామి వారి కళ్యాణాన్ని తిలకించారు. మండల కేంద్రంలోని రాజుపాలెం జయంతీ కాలనీలోని శ్రీ కోదండరామస్వామి దేవాలయంలో శ్రీ వైష్ణవ హరిదాసులు సీతారాముల కళ్యాణాన్ని కన్నుల పండువగా నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని తిలకించారు. అనంతరం మొక్కులు తీర్చుకుని వడపప్పు, పానకాలు , తీర్థప్రసాదాలు అందుకున్నారు. సాయంత్రం స్వామివారిని విద్యుత్ దీపాల అలంకారంలో వాయిద్యాలతో గ్రామోత్సవం నిర్వహించారు. గణపవరం, బలిజేపల్లి, అనుపాలెం, ఇనిమెట్ల, కోటనెమలిపురి, పెద నెమలిపురి తదితర గ్రామాల్లో కళ్యాణం నిర్వహించారు. అనంతరం భక్తులు స్వామివారికి మొక్కులు తీర్చుకున్నారు.

వైభవంగా శ్రీ సీతారాముల కళ్యాణోత్సవం

అమరావతి : దక్షిణకాశీ క్షేత్రంగా ప్రసిద్ధి గాంచిన అమరావతి కోదండ రామాలయంలోని శ్రీ సీతాసమేత కోదండరామునికి బుధవారం శ్రీరామనవమి సందర్భంగా కళ్యాణోత్సవం నిర్వహించారు. స్వామి వారికి తొలుత ఎదుర్కోల ఉత్సవం నిర్వహించిన అనంతరం దేవాలయంలో ప్రత్యేకంగా అలంకరించిన కళ్యాణ మండపంపై కళ్యాణాన్ని ఘనంగా నిర్వహించారు. ఆలయ అర్చక స్వామి పరాశరం రామకృష్ణమాచార్యులు ఆధ్వర్యంలో వైఖానస ఆగమానుసారం కళ్యాణాన్ని నిర్వహించారు. తొలుత విష్వక్సేనపూజ, పుణ్యాహవాచన, వరపూజ, కన్యాదానం, మాంగళ్యధారణ కార్యక్రమాలను శాస్త్రోక్తంగా నిర్వహించారు. ఈ కళ్యాణోత్సవంలో సుమారు 20 మంది దంపతులు పీటల మీద కూర్చొని కళ్యాణాన్ని నిర్వహించారు. ఈ కళ్యాణోత్సవంలో ఎమ్మెల్యే నంబూరు శంకరరావు పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ అర్చకులు మ్మెల్యే నంబూరు శంకరరావుకు ఆశీర్వచనం చేసి స్వామివారి శేషవస్త్రాన్ని అందచేశారు. అనంతరం భక్తులకు తీర్ధప్రసాదాలు, పానకం పంపిణీ చేశారు. ఈకళ్యాణోత్సవ కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకుడు నిమ్మా విజయ సాగరబాబుతో పాటుగ భక్తులు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు.

గ్రామ గ్రామాన సీతారాముల కళ్యాణం

మండల కేంద్రమైన అమరావతిలో, మండల పరిధిలోని గ్రామాల్లో సీతారాముల కళ్యాణాన్ని నిర్వహించారు. అమరావతిలో పల్లపువీధి రామాలయం, మిట్టమీద రామాలయం, అగ్రహారం రామాలయం, ధరణికోట తూర్పు, పడమర వీధులలో రామాలయాల్లో, దిడుగు, మల్లాది, జూపూడి, మునగోడు, అత్తలూరు, పెదమద్దూరు, ఉంగుటూరు గ్రామాల్లో శ్రీరామనవమి ఉత్సవాలను ఘనంగా నిర్వహించారు.

ఘనంగా శ్రీరామ నవమి వేడుకలు

నకరికల్లు : మండలంలోని పలు గ్రామాల్లో శ్రీరామనవమి వేడుకలు మంగళవారం వైభవంగా నిర్వహించారు. గ్రామాల్లోని రామాలయాల వద్ద చలువ పందిళ్లు ఏర్పాటు చేసి శ్రీరాముల వారి ఉత్సవమూర్తులను విశేషంగా అలంకరించారు. భక్తులు కుటుంబసమేతంగా తరలివచ్చి స్వామివారి కల్యాణాన్ని తిలకించారు. కల్యాణ వేడుకల అనంతరం స్వామివారిని దర్శించుకున్న భక్తులు మొక్కులు చెల్లించారు.



శ్రీసీతారాముల కళ్యాణాన్ని వీక్షిస్తున్న భక్తులు



మహారాష్ట్ర వీధిలో శ్రీసీతారాముల కళ్యాణంలో భక్తులు



నందిగామలో అన్నసంతర్పణలో భక్తులు



దూళిపాళ్లలో శ్రీసీతారాముల కళ్యాణంలో భక్తులు



పానకం పంపిణీలో కొత్త రామకృష్ణ, మద్ది వెంకటేశ్వరరావు

రాములోరి కళ్యాణంలో ఎమ్మెల్యే శంకరరావు దంపతులు



స్వామివారికి ముత్యాల తలంబ్రాలు సమర్పిస్తున్న ఎమ్మెల్యే నంబూరు శంకరరావు దంపతులు

అచ్చంపేట : శ్రీరామనవమి ఉత్సవాల్లో భాగంగా స్థానిక రామాలయం వద్ద బుధవారం జరిగిన శ్రీ సీతారాముల కళ్యాణ మహోత్సవాలకు ఎమ్మెల్యే నంబూరు శంకరరావు దంపతులు హాజరయ్యారు. స్వామివారికి ముత్యాల తలంబ్రాలు సమర్పించారు. శ్రీ వాసవీ కన్యకాపరమేశ్వరి వర్తక సంఘం ఆధ్వర్యంలో జరిగిన కళ్యాణ మహోత్సవంలో ఆర్యవైశ్యసంఘ సభ్యులు దంపత సమేతంగా పీటలపై కూర్చుని స్వామివారి కళ్యాణం జరిపించారు. అనంతరం ఎమ్మెల్యే దంపతులను నిర్వాహకులు సత్కరించారు. పలు గ్రామాలనుంచి భక్తులు తరలి వచ్చి స్వామివారిని తిలకించారు.

కుటుంబ స్థితిగతులు మారాలంటే చదువు ఒక్కటే మార్గం

ఎమ్మెల్యే నంబూరు శంకరరావు



కుశుమశ్రావ్యను శాలువాతో సత్కరించిన ఎమ్మెల్యే నంబూరు శంకరరావు

అమరావతి : గ్రామీణ ప్రాంతాల్లో కుటుంబ స్థితిగతులు మారాలంటే చదువు ఒక్కటే మార్గమని ఎమ్మెల్యే నంబూరు శంకరరావు అన్నారు. స్థానిక రాజావాసిరెడ్డి వెంకటాద్రినాయుడు, దాన్యకటక అకాడమి కళాశాలలో 2023-24 విద్యా సంవత్సరంలో ఇంటర్మీడియట్ పరీక్షలలో అత్యధిక మార్కులు సాధించిన వి.కుశుమ శ్రావ్యను పలువురు ప్రముఖులు అభినందించారు. మండల పరిధిలోని మల్లాదికి చెందిన వి.కుశుమ శ్రావ్య ఇంటర్ ఎంపిసి గ్రూపులో వెయ్యి మార్కులకు 982 సాధించింది. బుధవారం మల్లాది గ్రామంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఎమ్మెల్యే నంబూరు శంకరరావు కుశుమ శ్రావ్యను శాలువాతో సత్కరించి అభినందించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ పట్టుదల,కృషి, క్రమశిక్షణతో చదివితే ఎంత పెద్ద లక్ష్యాన్నైనా సాధించవచ్చన్నారు. ఈ కార్యక్రమంలో క్రోసూరు మార్కెట్‌యార్డు మాజీ చైర్మన్ వెంపా జ్వాలా లక్ష్మీ నరసింహారావు, మండల వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు భవిరిశెట్టి హనుమంతరావు, వైఎస్సార్‌సీపీ నాయకుడు వెంపా వాసులతో పాటు గ్రామస్థులు పాల్గొన్నారు.

తెలంగాణ మద్యం పట్టివేత : వ్యక్తి అరెస్ట్



అచ్చంపేట : మండలంలోని మాదిపాడు పంచాయతీ పరిధిలోని గింజుపల్లి తండాకు సమీపంలో ఎక్సైజ్ అధికారులు బుధవారం 72 కేసుల తెలంగాణా మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకున్నారు. వీటి విలువ రూ.4.50లక్షలుగా ఉండవచ్చని అంచనా వేస్తున్నారు. క్రోసూరు ఎక్సైజ్ సర్కిల్ ఇన్‌స్పెక్టర్ అశోక్‌కుమార్ మాట్లాడుతూ గింజుపల్లి కాలనీకి సమీపంలో మద్యం నిల్వలు ఉన్నట్లు పల్నాడు జిల్లా అడిషనల్ ఎస్పీ ఆదేశాల మేరకు తనిఖీలు నిర్వహించడం జరిగిందన్నారు. మాదిపాడు గ్రామానికి చెందిన అబ్దుల్ సత్తార్ ఆధీనంలో ఉన్న 72 కేసుల్లోని 3,456 బాటిళ్లను స్వాధీనం చేసుకుని నిందితుడు అబ్దుల్ సత్తార్‌ను అరెస్ట్ చేసినట్లు చెప్పారు. అచ్చంపేట పోలీస్ సర్కిల్ ఇన్‌స్పెక్టర్ షేక్ కరిముల్లా షావలి సహాయంతో నివాసాలను సోదా చేశామన్నారు. అనుమానం ఉన్న గృహాలను కూడా తనిఖీ చేయడం జరిగిందన్నారు. తనిఖీల్లో 72కేసులు మద్యం మాత్రమే చిక్కినట్లు చెప్పారు. కార్యక్రమంలో ఎక్సైజ్ అధికారులు షేక్ ఖాజా మెహిద్దీన్, బాబావలి, జోగేష్ రావు, వెంకటేశ్వర్లు, నాగరాజు పాల్గొన్నారు.

ఎన్నికల యుద్ధానికి అంబటి సన్నద్ధం

నేడు మెగా బైక్ ర్యాలీ విజయవంతం చేయండి



మహిళలకు అభివాదం చేస్తున్న మంత్రి అంబటి

రాజుపాలెం : సార్వత్రిక ఎన్నికల యుద్ధానికి అంబటి సిద్ధమవుతున్నారు. నామినేషన్‌ను అత్యంత ప్రతిష్టాత్మకంగా తీసుకుని భారీ స్థాయిలో నిర్వహించేందుకు ప్రణాళికలు సిద్ధం చేస్తున్నారు. ఈ నెల 24న నామినేషన్ కార్యక్రమం విజయవంతానికి సన్నద్ధంగా 18న నియోజకవర్గంలో నాలుగు మండలాలను కలుపుతూ మెగా బైక్ ర్యాలీ నిర్వహిస్తున్నారు. మండలంలోని గణపవరం, కొత్తూరు గ్రామాల్లో బుధవారం పర్యటించారు. ఈ సందర్భంగా మంత్రి అంబటి రాంబాబు మాట్లాడుతూ నియోజక వర్గంలో 18న 3000 బైక్‌లతో మెగా బైక్ ర్యాలీ జరుగుతుందని చెప్పారు. నాయకులు, బైకు ర్యాలీలో పాల్గొని జయప్రదం చేయాలని కోరారు. ఆయన వెంట మండల కన్వీనర్ వేపూరి శ్రీనివాసరావు, ఎంపీపీ తేలుకుట్ల రాజేశ్వరిచంద్రమౌళి, వైఎస్సార్ సీనియర్ నాయకులు లాయర్ సూరిబాబు, మండల అభివృద్ధి కమిటీ చైర్మన్ మర్రి సుబ్బారెడ్డి, సర్పంచ్‌లు బొలమాల నాగమల్లేశ్వరరావు, పులిబండ్ల అశోక్, జీడీసీఎంసీ డైరెక్టర్ పాలవాయి ఆదినారాయణ, తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి



ప్రమాదం జరిగిన స్థలంలో మృతుడు వర్ల మరియబాబు

నకరికల్లు : రోడ్డుప్రమాదంలో ఐస్‌క్రీం బండి చిరువ్యాపారి మృతిచెందాడు. ఈ సంఘటన మండలంలోని శ్రీరాంపురం వద్ద మంగళవారం జరిగింది. సంఘటనకు సంబంధించిన వివరాలు ఇలాఉన్నాయి. నకరికల్లుకు చెందిన వర్ల మరియబాబు(40) గ్రామాల్లో తిరిగి ఐస్‌క్రీం బండి నడుపుకుంటూ జీవనం సాగిస్తుంటాడు. ఐస్‌క్రీం అమ్ముకునేందుకు వెళ్లి తిరిగి వస్తుండగా అద్దంకి-నార్కట్‌పల్లి రాష్ట్ర రహదారిపై శ్రీరాంపురం సమీపంలో మిర్చిలోడుతో వెనుక నుంచి వస్తున్న లారీ ఢీకొట్టింది. తీవ్రగాయాలు కావడంతో మరియబాబు అక్కడికక్కడే మృతిచెందాడు. లారీ అతివేగం కారణంగా ప్రమాదం జరిగిందని స్థానికులు చెబుతున్నారు. ఘటనాస్థలానికి చేరుకున్న ఎస్‌ఐ పి.రాంబాబు ప్రమాదం జరిగిన తీరును పరిశీలించారు. మృతదేహానికి పోస్టుమార్టం నిమిత్తం నరసరావుపేట ఏరియా వైద్యశాలకు తరలించారు. ఘటనపై కేసునమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

వైఎస్సార్‌సీపీలో చేరిన గుడిపాడు ముస్లింలు



వైఎస్సార్‌సీపీలో చేరిన టీడీపీ కార్యకర్తలు

కండువా కప్పి ఆహ్వానించిన ఎమ్మెల్యే నంబూరు శంకరరావు

క్రోసూరు : పెదకూరపాడు నియోజకవర్గంలో వైఎస్సార్‌సీపీకి ముస్లిం మైనారిటీల మద్దతు పెరుగుతోంది. క్రోసూరు మండలం గుడిపాడుకు చెందిన టీడీపీ కార్యకర్తలు ఎమ్మెల్యే నంబూరు శంకరరావు సమక్షంలో వైఎస్సార్‌సీపీలో చేరారు. వారిలో టీడీపీ గుడిపాడు గ్రామ పార్టీ కన్వీనర్ షేక్ హసన్ బుడే, షేక్ షఫీ, షేక్ ఖాశిం వలీ, కల్లూ భాషా, షేక్ జానీ భాషా, షేక్ మస్తాన్ వలి, షేక్ యూసుఫ్, షేక్ పెద్ద సైదా, షేక్ చిన్న సైదా, బండి వెంకట్రావు, షేక్ మాహబూబ్ సుభాని, బి. బాజి, షేక్ మహమ్మద్ ఖాశిం ఉన్నారు. కార్యక్రమంలో సొసైటీ డైరెక్టర్ , గ్రామ పార్టీనాయకుడు షేక్ ఖాజా, క్రోసూరు ఏఎంసీ వైస్ చైర్మన్ గార్లపాటి దాసు, ఎంపీపీ పి.కోటయ్య పాల్గొన్నారు.

గుర్తు తెలియని వ్యక్తి మృతి



మృతి చెందిన వ్యక్తి

పిడుగురాళ్ల : గుర్తు తెలియని వ్యక్తి మృతి చెందిన సంఘటన మండలంలోని తుమ్మల చెరువు గ్రామంలో బుధవారం జరిగింది. సంఘటనకు సంబంధించిన ఎస్ఐ అమీర్ తెలిపిన వివరాల మేరకు గుర్తు తెలియని వ్యక్తి తుమ్మల చెరువు గ్రామంలో సంచరిస్తుండటంతో అతని వెంట కుక్కలు పడటంతో పరుగు తీస్తూ గోడ సందులో ఇరుక్కున్నాడు. ఈ క్రమంలో స్థానికులు అతడిని గోడ నుంచి బయటకు తీశారు. కొంత సమయానికి అతను వడ దెబ్బకు గురై చనిపోయి ఉండవచ్చని ఎస్ఐ తెలిపారు. మృతిని వయస్సు సుమారు 35 సంవత్సరాలు ఉంటుందని, వంటి మీద బులుగు రంటు టీ షర్టు , గడ్డం ఉందని తెలిపారు. ఆచూకీ తెలిసిన వారు పట్టణ సీఐ పీవీ ఆంజనేయులు 9440796236 నెంబర్‌కు సమాచారం ఇవ్వాలని ఈ సందర్భంగా ఎస్ఐ అమీర్ పేర్కొన్నారు.

అవగాహనతోనే అగ్ని ప్రమాదాల నియంత్రణ

అగ్నిమాపక కేంద్ర అధికారి ఎంవి సుబ్బారావు



అగ్నిప్రమాదాల నియంత్రణపై అవగాహన కల్పిస్తున్న అగ్నిమాపక సిబ్బంది

సత్తెనపల్లి : అవగాహనతోనే అగ్ని ప్రమాదాల నియంత్రణ సాధ్యమని సత్తెనపల్లి అగ్నిమాపక కేంద్ర అధికారి ఎంవి సుబ్బారావు అన్నారు. అగ్నిమాపక వారోత్సవాల్లో భాగంగా బుధవారం పట్టణంలోని శ్యాంసుందర్ పెట్రోల్ బంక్ నందు అగ్నిప్రమాదం సంభవించినప్పుడు ఎలా ఎదుర్కోవాలో డెమో ద్వారా ప్రత్యక్షంగా అవగాహన కల్పించారు. కార్యక్రమంలో శ్యాంసుందర్ పెట్రోల్ బంక్ యజమాని రాజశేఖర్, మేనేజర్ శ్రీనివాసరావు, అగ్నిమాపక కేంద్ర సిబ్బంది లీడింగ్ ఫైర్ మాన్‌లు షేక్ గౌస్, ఆర్ హుస్సేన్, ఫైర్ మాన్‌లు కె.శ్రీనివాసరావు, సుభాని, మహేందర్ రెడ్డి, గోవింద్, డ్రైవర్ ఆపరేటర్ రామకృష్ణ, సిబ్బంది, పాల్గొన్నారు.